హోరాహోరీగా క్రికెట్ పోటీలు


107 పరుగులు చేసిన నెల్లూరు క్రీడాకారుడు రోహిత్


సెంచరీ సాధించిన కర్నూలు ప్లేయర్ హృదయ్


105 పరుగులు చేసిన నెల్లూరు ఆటగాడు తరుణ్

వెంకటగిరిరూరల్ : పట్టణంలోని తారకరామ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ అండర్-16 క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం కడప-కర్నూలు, అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య పోటీలు జరిగాయి. గ్రౌండ్-1లో కడప- కర్నూలు జట్ల మధ్య జరిగిన పోటీల్లో కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొత్తం 93 ఓవర్లలో 246 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించి ఆట ముగిసే సమయానికి 13 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 79 పరుగులు చేసింది. రెండోరోజు ఆట ముగిసే సమయానికి కడప జట్టు 107 పరుగుల ఆధిక్యంతో ఉంది. శనివారం మ్యాచ్ కొనసాగనుంది. గ్రౌండ్-2లో అనంతపురం- నెల్లూరు జట్లమధ్య జరుగుతున్న మ్యాచ్‌లో నెల్లూరు జట్టు రెండో రోజు ఆట కొనసాగించి మొత్తం 178 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 534 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించి ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 33 పరుగులు చేసింది. అనంపురం జట్టు నెల్లూరు జట్టు కంటే 506 పరుగులు వెనుకంజలో ఉంది.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని పెద్దకనపర్తి వద్ద ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం సెబ్ అధికారులు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు. పిల్లమేడు చెందిన గురవయ్య ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మాజీ సైనికులకు త్వరలో ఇంటి స్థలాలు

- సైనికుల సంక్షేమానికి కృషి
- ఘనంగా అమర జవాన్ స్థూపం ఆవిష్కరణ
- పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,
- జెడ్పీ చైర్మన్, కలెక్టర్, ఎస్పీ


అమరజవాన్ స్థూపం ఆవిష్కరణలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : దేశ సేవలో అశువులు బాసిన అమరువీరులు ఎంతో మంది మన జిల్లాలో ఉన్నారని, వారి సేవలు శ్లాఘనీయమని విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సైనిక సంక్షేమ శాఖ సభ్యులు, మాజీ సభ్యుల విన్నపం మేరకు త్వరలో సైనికులకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్‌ను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తిరుత్తణి బస్టాండ్ వద్ద అమర జవాన్ స్థూపం ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి, అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. చిత్తూరులో అమరవీరుల సేవలకు గుర్తుగా స్మారక స్థూపం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థూపం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

సైనికులు, మాజీ సైనికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. సైనికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను ఇస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో మృతి చెందిన 23 మంది అమర జవాన్‌లను సేవలను గుర్తుచేసుకుంటూ స్థూపం వద్ద ఏటా నాలుగు రోజులు సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఏడు వేల మంది సైనికులు ఆర్మీలో పనిచేస్తున్నారని చెప్పారు. కలెక్టర్ ఎస్.షన్మోహన్ మాట్లాడుతూ మాజీ సైనికుల ఇళ్ల స్థలాల సమస్యలను త్వరతిగతిన పరిష్కరిస్తామన్నారు. త్వరలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎస్పీ రిశాంత్ రెడ్డి మాట్లాడుతూ సైనికులు, మాజీ సైనికుల సమస్యలను పోలీసు శాఖ తరుపున పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. సైనిక సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలోచిత్తూరు జిల్లాకు చెందిన ముగ్గురు సైనికులు విధి నిర్వహణలో అసువులు బాశారని తెలిపారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి ఒక్కో కుటుంబానికి రూ. 50 లక్షలు మంజూరు చేసిందన్నారు జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, కార్పొరేటర్ షర్మిల, సైనిక సంక్షేమ శాఖాధికారి విజయశంకర్‌రెడ్డి, మాజీ సైనిక సంక్షేమ సంఘం సభ్యులు పళని, సిద్ధయ్య, వరదరాజులు, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.60,700
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,451
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.72,200
రిటైల్ వెండి గ్రాము రూ.74.20

వేదిక్ వర్సిటీలో అత్యాధునిక తాళపత్ర స్కానర్

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక తాళపత్ర స్కానర్‌ను శుక్రవారం టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ శ్రీవేకటేశ్వర తాళపత్ర పరిశోధన సంస్థ దేశంలోనే అతిగొప్ప సంస్థగా ఎదగాలన్నారు. దానికి టీటీడీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణీ సదాశివమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీ రాధేశ్యామ్, డీన్లు గోలి సుబ్రహ్మణ్యశర్మ, డాక్టర్ ఫణియాజులు, తాళపత్ర విభాగాధిపతి విజయలక్ష్మి, పీఆర్వో బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

కేంద్ర ఆరోగ్య పథకాల్లో అవకతవకలు వాస్తవమా?


పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి


తిరుపతి మంగళం : దేశంలో అమలవుతున్న కేంద్ర ఆరోగ్య పథకాల్లో ఆర్థిక అవకతవకలు వాస్తవమేనా అని ఎంపీ గురుమూర్తి ప్రశ్నించారు. శుక్రవారం ఢిల్లీ పార్లమెంట్ సమావేశాల్లో ఆయన కేంద్రప్రభుత్వంపై ప్రశ్నల పరంపర సంధించారు. పథకాల్లో ఆర్థిక అక్రమాలు గుర్తించి నిరోధించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వినియోగించాలని భావిస్తున్నారా అని అడిగారు. ఆస్పత్రుల్లో పథకాల అమలును తనిఖీ చేసి దోషులపై తీసుకున్న చర్యలను వివరించాలని కోరారు. దీనిపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి మాన్సుక్ మాండవీయ సమాధానమిచ్చారు. నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు ఇటీవల న్యూఢిల్లీలోని ఎయిమ్స్ కేంద్రంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై అన్వేషిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఆయుష్మాన్ భారత్ అమలు చేస్తున్న నేషనల్ హెల్త్ అథారిటీ, ప్రధాన మంత్రి - జన్ ఆరోగ్య యోజన, నేషనల్ యాంటి ఫ్రాడ్ యూనిట్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

18న చెంగాళమ్మకు పుష్పయాగం


విశేషాలంకరణలో అమ్మవారు

సూళ్లూరుపేట : పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నిజ శ్రావణమాసం తొలి శుక్రవారం ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ చెన్నైకు చెందిన నంబూరు మోహన్ రావు-సులోచనమ్మ, నంబూరు మనోజ్‌సాయి-లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించనున్నట్లు వెల్లడించారు.

చిలుకపై సుబ్రహ్మణ్యస్వామి


ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రహ్మణ్యస్వామివారు ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చిలుక వాహనంపై విహరించారు. తొలుత ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దేవదేవేరులను చిలుక వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ పాలకమండలి చైర్మన్‌అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్

తిరుపతి క్రైం : తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న నలుగురు బాలురను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు క్రైమ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితుల నుంచి రు.2లక్షల విలువైన రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మైనర్ బాలురు నలుగురు ముఠా ఏర్పడి ఒంటరిగా వెళుతున్న వారిని బెదిరించి దోచుకునేవారని వివరించారు. వీరు చెడు వ్యసనాలకు అలవాటు పడి, చదువు మానేసి జులాయిగా తిరిగేవారని చెప్పారు. నిందితులను జువైనల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.

'పండుగ' సంబరం


పోలేరమ్మతల్లి ఆలయం వద్ద నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

వెంకటగిరిరూరల్ : వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌జీఆర్ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అడిగిన వెంటనే వెంకటగిరి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో వెంకటగిరి రాజాలతో చర్చించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా గతంలో కంటే మెండుగా పోలేరమ్మ జాతర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం త్రిభువని సెంటర్‌లోని దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ క్రమంలోనే పోలేరమ్మతల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వీట్స్ పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ దొంతు శారద, పార్టీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ ఎస్.బాలయ్య, ఆర్టీసీ రీజనల్ కమిటీ మాజీ చైర్మన్ చెలికం శంకర్‌రెడ్డి, విబ్ పూజారి లక్ష్మి, మహిళావిభాగం అధ్యక్షులు ధనియాల రాధ, పార్టీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబువి నీచ రాజకీయాలు


వాకాడు: బీచ్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

చిల్లకూరు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి ఓర్వలేని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు దుయ్యబట్టారు. మండలంలోని చింతవరంలో రూ.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఒకసారి తిరస్కరించే సరికే చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారన్నారు. ఇక పవన్‌కళ్యాణ్ ఏమి మాట్లాడుతాడో తెలియడం లేదన్నారు. అనంతరం చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షులు చేవూరు నాగరాజు తన తండ్రి జ్ఞాపకార్థం ఆస్పత్రికి ఈసీజీ మిషన్‌ను వితరణగా అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీహరి, జెడ్పీటీసీ సభ్యుడు ఎం శీనయ్య, వైస్ ఎంపీపీ చెంగయ్య, ఎంపీటీసీ సభ్యులు పీ మాధవి, ఎల్లసిరి జానకిరామ్, డీ కోటేశ్వరరరావు, పీఏసీఎస్ చైర్మన్ ఆర్ పిచ్చయ్య నాయుడు, సర్పంచ్‌లు జే సుగుణమ్మ, సీ నారాయణ, ఏఎంసీ చైర్‌పర్సన్ ఓ యమునమ్మ, డైరెక్టర్లు సందానీ బాషా, సుందర్‌రాజ్ పాల్గొన్నారు.

తూపిలిపాళెం బీచ్ అభివృద్ధికి కృషి

వాకాడు: మండలంలోని తూపిలిపాళెం బీచ్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. శుక్రవారం ఆయన తూపిలిపాళెం బీచ్ పరిసర ప్రాంతాలతోపాటు రహదారులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తూపిలిపాళెం బీచ్ అభివృద్ధి పరిచే క్రమంలో ముందుగా బీచ్‌కు వెళ్లే రహదారులను డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం సునామీ పరిశోధన కేంద్రాన్ని(ఎన్‌ఐఓటీ) ఇంజినీర్ల బృందంతో కలసి పరిశీలించారు. ఈయన వెంట వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కే దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ గోపీనాథ్ ఉన్నారు.


చిల్లకూరు: ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

రూ.1.25 లక్షల విలువ చేసే గంజాయి పట్టివేత


సూళ్లూరుపేట: నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సూళ్లూరుపేట: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారనే ముందస్తు సమాచారంతో శుక్రవారం సాయంత్రం దాడులు చేసి రూ.1.25 లక్షల విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి, సెబ్ డీఎస్ ఈఓ రాజేంద్ర ఆదేశాల మేరకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, సెబ్ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించగా వరదయ్యపాళెం మండలం, తొండూరు సొసైటీ గ్రామానికి చెందిన కొమ్మలపూడి రవికుమార్, తడ మండలం, కారూరుకు చెందిన శ్రీహరికోట ప్రకాష్, చెన్నై నగరంలోని ఎన్నూరుకు చెందిన భూమినాథం ముత్తు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేశారు. సెబ్ సీఐ సూర్యనారాయణ, ఎస్‌ఐ బీ.శశికుమార్, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి, ఏఎస్‌ఐ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

గూడూరురూరల్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం గంజాయి విక్రేతను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి 4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. తమిళనాడుకు చెందిన ఆటో డ్రైవర్ పరశురాం కిషోర్‌కుమార్ అనే యువకుడు అనకాపల్లెకు చెందిన రాజా అనే వ్యక్తి వద్ద రూ.20వేలకు 4 కేజీల గంజాయిని కొనుగోలు చేసి దాన్ని చెన్నైలో విక్రయించేందుకు తీసుకెళుతున్నాడని చెప్పారు. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజేంద్ర ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడైనా గంజాయి రవాణా, విక్రయాలను గుర్తిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఎ.శేషమ్మ, హెడ్‌కానిస్టేబుల్ ఎం.కిరణ్‌సింగ్, సిబ్బంది పి.రమేష్, వీఎస్ ప్రసాద్, ఎం.కృష్ణ, ఎస్‌కే బాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు భద్రతపై అవగాహన

పెళ్లకూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ రహదారి కళానృత్య బృందం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

ఉద్యోగాలకు 47 మంది ఎంపిక

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పలు సంస్థలు క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించాయి. గ్రీన్‌టెక్, డైకన్, దేహాఫార్మా కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్లలో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు 47 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ భూములు కాపాడండి



దొరవారిసత్రం: నెలబల్లి రెవెన్యూ పరిధిలోని కలగుంట ఎస్టీ కాలనీకి ఆనుకుని 364, 365 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి కాపాడాలని ఆ కాలనీ వాసులు కోరారు. ఈ నంబర్లలో సుమారు మూడు ఎకరాలు ఆక్రమణకు గురైంది. దీనిపై శుక్రవారం కలగుంట ఎస్టీ కాలనీకి చెందిన పలువురు మహిళలు స్థానిక తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

ఘనంగా నగరోత్సవం



నాయుడుపేటటౌన్: పట్టణంలోని భవానీ పెద్ద పాళెపమ్మ ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఓం శక్తి మాలధారణ చేసిన భక్తులు కలశాలతో నగరోత్సవం ఘనంగా నిర్వహించారు. గత నెల 24 తేదీన ఓంశక్తి మాలధారణ చేసిన భక్తులతో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కలశాలతో నగరోత్సవం జరిపారు.

ఎంపీటీసీ సభ్యురాలి మృతి

కోట: మండలంలోని కేసవరం ఎంపీటీసీ సభ్యురాలు తూపిలి లక్ష్మమ్మ(50) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృత దేహం వద్ద పలువురు నివాళులర్పించారు. ఎంపీపీ దాసరి అంజమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య, మద్దాలి సర్పంచ్ వాణి, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు కే ధనుంజయరెడ్డి నాయకులు చేవూరు నాగేశ్వరరావు, శివరామ్‌నాయుడు, ఎంపీడీఓ భవానీ ఉన్నారు.

ఖాళీ స్థలాలకు టెండర్లు

రాపూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణాలు ఏర్పాటుకు స్థలాన్ని టెండర్ల ద్వారా పొందవచ్చని డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 22వ తేదీన టెండర్లు జరుగుతాయని, అవసరమైనవారు స్థానిక డి పో కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చన్నారు.

పంటకోత ప్రయోగం కీలకం

గూడూరురూరల్: పంట దిగుబడిని అంచనా వే యడానికి పంట కోత ప్రయోగాలు చాలా కీలక మని వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్ తెలిపా రు. స్థానిక ఏడీ కార్యాలయంలో శుక్రవారం పంట కోత ప్రయోగాలపై ఆర్బీకే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఏఓలు వి.రమేష్, ఎం.భవానీ, డివిజనల్ గణాంకాధికారి ఎం, వాణి, మండల గణాంకాధికారులు వై. శ్రీనివాసులురాజు, ఎస్.కె.చాంద్‌బాషా, ఉద్యాన వనశాఖాధికారి కార్తీక్ పాల్గొన్నారు.

టీచర్లకు సన్మానం



వాకాడు: మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన టి సుధీర, ఎస్కే షాహినాను సహచర ఉపాధ్యాయులు, ఎంఈఓ నసీంఅలీ శాలువ కప్పి సత్కరించారు. హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, జే కిషోర్, వేలాయుధం, శీనయ్య పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

చిల్లకూరు: వీఆర్వోకు విధినిర్వహణలో ఆటంకం కలిగించి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని పున్నపువారిపాళెంలో వీఆర్వో సుబ్రహ్మణ్యం బీఎల్వో విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన రమణయ్య అనే వ్యక్తి ఆయన్ని అడ్డగించారు. ఈ విషయమై వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమణయ్యపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్రావెల్ టిప్పర్ల సీజ్

చిల్లకూరు: ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడు టిప్పర్లను పోలీసులు శుక్రవారం సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కలవకొండ సమీపంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకుని, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మూడు టిప్పర్లను సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించి విచారణ జరుపుతున్నారు.



మేకల బుజ్జమ్మది మానమాల గ్రామం. భర్త చనిపోవడంతో వితంతవు పింఛన్ కోసం వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. సచివాలయ సిబ్బంది పరిశీలించి, అర్హత ఉండడంతో వితంతువు పింఛన్‌ను మంజూరు చేశారు. ఏడాది నుంచి పింఛన్ అందుకుంటూ సంతోషంగా ఉంది.



చిలమానుచేను గ్రామానికి చెందిన సుబ్బరాయులు భూ సమస్యలు పరిష్కారం కోసం కార్యాయాలు చుట్టూ తిరిగి వేసారిపోయారు. అయినా భూ సమస్య పరిష్కారం కాలేదు. సచివాలయాలు ఏర్పాటు చేసిన తర్వాత ఆయన భూ సమస్య పరిష్కారం అయ్యింది. అడంగళ్లు, వన్‌బీ, పట్టాదారు పాసుపుస్తకం తదితరరాలన్నీ అందాయి.

గ్రామ స్వరాజ్యం సాకారం

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలందించాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారమైంది. ప్రజలు సులభతరంగా ప్రభుత్వ సేవలు అందుకుంటున్నారు. 2019 అక్టోబర్ 2న ప్రారంభమైన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలనూ క్షేత్రస్థాయిలో అందుతున్నాయి.



ఓజిలి సచివాలయం

- సచివాలయ వ్యవస్థతో గడప గడపకూ ప్రభుత్వ సేవలు
- గ్రామాల్లోనే అందుతున్న 536 సేవలు
- కష్టాలు తప్పాయని గ్రామీణుల ఆనందం

ఓజిలి: మండలంలో 10 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 110 మంది ఉద్యోగులు, 218 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. పల్లె ప్రజలకు సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రభుత్వ సేవలు వారి ముంగిటకే వెళ్లేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సేవలను విస్తృతం చేసింది. దీంతో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. సచివాలయం ద్వారా మొత్తం 536 సేవలను ప్రభుత్వం అందిస్తోంది.

సేవలు సులభతరం

సచివాలయాల్లో ప్రధానంగా ఇంటి పట్టా, రేషన్‌కార్డు, మ్యుటేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పోలీసు వెరిఫికేషన్, నో ఎర్నింగ్ సర్టిఫికెట్, వన్–బీ, అడంగల్, పింఛన్ దరఖాస్తు, సదరన్, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు, కరెంటు తదితర సేవలు ఎక్కువగా జరుగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డు కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగేవాళ్లు. అది కూడా రెండేళ్లకోసారి కార్డులు ఇచ్చేవారు. ఈ కార్డులకు కూడా పల్స్ సర్వేకు ముడిపెట్టి అప్పట్లో కోతలు పెట్టేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఒక్కరోజులోనే వందలాది మందికి కార్డులు ఇచ్చారు.

సచివాలయాల పనివేళల్లో పలువురు రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేస్తున్నారు. అర్హత ఉంటే నిర్ణీత సమయంలో వలంటీర్ల ద్వారా కార్డులు ఇంటికి చేరుస్తున్నారు. ఇదే కోవలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకుంటే అర్హత ఆధారంగా 90 రోజుల్లో ఇంటి స్థలం మంజూరు చేస్తున్నారు. గతంలో కుల, ఆదాయ ధృవీకరణ పత్రానికి కూడా సుదూరంలోని మండల కేంద్రానికి వెళ్లాల్సివచ్చేది. వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్ సంతకాల కోసం ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ కష్టాలకు చెక్ పెట్టింది. వలంటీర్ చేత దరఖాస్తు ఫారం ఇస్తే చాలు 7 రోజుల్లో ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. సచివాలయాల్లోనే మ్యుటేషన్ చేసే అవకాశం కల్పించారు. పింఛన్ కూడా నిర్ణీత గడువులోపు మంజూరయ్యేలా ప్రభుత్వమే ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. దీంతో కార్యాలయాల్లో ప్రజలకు క్యూ కట్టాల్సిన అవసరం తప్పింది.

మండలం :	ఓజిలి
మొత్తం సచివాలయాల సంఖ్య :	10
సిబ్బంది :	110
వలంటీర్లు :	218
నాలుగేళ్లలో మంజూరు చేసిన	
రేషన్ కార్డులు :	1,320
ఇంటి స్థలాలు :	436
మ్యుటేషన్ పత్రాలు :	3,520
సదరన్ సర్టిఫికెట్లు :	285
ఆధార్ సేవలు :	3580
కుల, ఆదాయ ధ్రువపత్రాలు :	9,350



కార్యాలయాలకు వెళ్లే శ్రమ తగ్గింది

గతంలో సమస్యలు పరిష్కరించునేందుకు మండల కార్యాలయాలు, పట్టణాలకు వెళ్లి ఇబ్బందిపడేవాళ్లం. అయితే ఆ సమస్యలు పరిష్కారం అయ్యేవి కావు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయాలను నిర్మించారు. అన్ని పనులు సచివాలయాల్లో పూర్తి అవుతున్నాయి.

– ముమ్మడి రామయ్య, కర్రబల్లవోలు



అందుబాటులో సేవలు

సచివాలయాలు ఏర్పాటు చేశాక వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉన్నారు. సచివాలయాల్లో వివిధ రకాలు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ సర్టిఫికెట్లు, ఆధార్ సేవలు, రేషన్ కార్డులు, రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ఇంటి వద్దనే పనులు పూర్తి అవుతుండటంతో కార్యాలయాలకు వెళ్లే బాధ తప్పింది.

– తుపాకుల మీనాక్షి, రాజుపాళెం

ఈ పంట నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ నాగార్జునసాగర్

వెంకటగిరిరూరల్: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం మండలస్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటల సాగు విషయంపై రైతులు తప్పనిసరిగా అధికారులు సలహాలు, సూచనలు పాటించాలన్నారు. భూసారం పెంపొందించేందుకు పచ్చిరొట్ట పైర్లు జీనుగలు, పిల్లిపెసర, జనుము సాగు చేయాలన్నారు. ఏఓ సుజాత, పాల్గొన్నారు.

సీఎం ప్రకటన హర్షణీయం



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

వెంకటగిరిరూరల్: పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జీఓ విడుదల చేయడం హర్షణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్ భానుప్రియ తెలిపారు. పట్టణంలో 22వ వార్డు జీనుగుల వారివీధిలో పోలేరమ్మ మెట్టినిల్లు వద్ద కౌన్సిలర్ సీ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ట కలిగిన పోలేరమ్మ జాతరను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనసుతో రాష్ట్ర పండుగగా గుర్తించడం ఆనందం దాయకమన్నారు. వైస్‌చైర్మన్ ఎస్ బాలయ్య, నే తలు సీ హరికృష్ణ, డీ రాధమ్మ, కౌన్సిలర్లు సుబ్బారావు, ఏ శ్రీనివాసులు, శంకరయ్య, ఎంఏ నారాయణ, న్యాయవాది కోటేశ్వరరావు,నేతలు శ్రీనివాసులు, మల్లిరెడ్డి, వెంకటరత్నంరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి గంగమ్మ కొలుపు



రాపూరు: మండలకేంద్రంలో ఉన్న గంగమ్మ కొలుపు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 7 గంటలకు వీరగంధం, రాత్రి 7 గంటలకు గంగపెట్టి నిలుపుదల, 9 గంటలకు గంగపెట్టి ఊరేగింపు జరుగుతుందన్నారు. 13వ తేదీ ఉదయం నుంచి పొంగళ్లు సాయంత్రం బద్దిగొర్లె తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొలుపు సందర్భంగా ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు.

పథకాలతో ప్రజలు సంతృప్తి



విద్యార్థులతో ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి

కలువాయి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పీ నాగార్జునరెడ్డి అన్నారు. కలువాయి మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. పెన్నబద్దెవోలులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేసి, కూలీలతో మాట్లాడారు. బ్రాహ్మణపల్లెలో నా భూమి–నా దేశం కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో మొక్కలు నాటారు. కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. అనంతరం కలువాయి సచివాలయం –2 సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ ధనలక్ష్మి, డ్వామా పీడీ వెంకట్రావు, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీఓ నారాయణ, ఎంఈఓలు బాలకృష్ణారెడ్డి, శేషగిరిరావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక శ్రావణమాసం సందర్భంగా ఆలయం వద్ద సాయంత్రం శ్రీచక్రయంత్ర మహామేరువు, వ్యూహ్యలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం 108 కమల పుష్పాలతో మూల మంత్ర హోమాలు, సామూహిక కుంకుమార్చన, శ్రీదేవి ఖడ్గమాల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

దోమల నివారణకు మందు పిచికారి

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలో దోమలు నివారించేందుకు మందు పిచికారి చేస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మురుగు కాలువల్లో లార్వాలు అభివృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయడంతోపాటు మందు పిచికారి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు కూడ తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త నిల్వలను డ్రైనేజీ కాలువల్లో పడేయకుండా ఇళ్ల వద్దకు వస్తున్న పారిశుద్ధ్య కార్మికులు అందజేయాలన్నారు. పట్టణంలోని శుక్రవారం దోమల నివారణకు మందు పిచికారి చేస్తున్న పలు ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు.

దళితుల ఆందోళన

పెళ్లకూరు: జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని శుక్రవారం అక్కగారిపేట గ్రామానికి చెందిన పలువురు దళితులు సీఐటీయూ ఆధ్వర్యంలో రహదారిపై ఆందోళన చేశారు. రోడ్డు అభివృద్ధి కోసం భూములు తీసుకున్న అధికారులు పరిహారం చెల్లింపు విషయంలో నాలుగేళ్లుగా జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం చెల్లించకుంటే మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందయ్య, ఉదయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, జగ్గ య్య, విక్టర్‌బాబు, సుందరయ్య పాల్గొన్నారు.

గడప గడపలో ప్రజాదరణ



వెంకటగిరిరూరల్: బుక్‌లెట్ అందజేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి



సైదాపురం: చాగణంలో నేదురుమల్లికి స్వాగతం పలుకుతున్న మహిళలు

వెంకటగిరిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని, దీంతో తమకు గడప గడపలో అపూర్వ ప్రజాదరణ లభిస్తుందని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 19వ వార్డు పీర్జాతిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి వారు పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వహిద, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, విజ్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు కళ్యాణి, ఏ శ్రీనివాసులు, సుబ్బారావు, ఎంఏ నారాయణ, ఎం జానకిరామ్, వెంకటగిరి పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పీ ప్రసాద్‌రెడ్డి, నేతలు యస్దానీబాషా, సదారెడ్డి పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

సైదాపురం: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాగణం సచివాలయం పరిధిలోని బస్టాండ్, ఎస్టీకాలనీ, కొత్త ఎస్సీ కాలనీల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా నేదురుమల్లికి ఘన స్వాగతం పలికారు. అడుగు అడుగునా మహిళలు హారతులిస్తూ, పూలు చల్లుతూ నీరాజనాలు పలికారు. నేదురుమల్లి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి, బుక్‌లెట్‌లు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేదురుమల్లి మాట్లాడుతూ 350 ఏళ్లుగా నెరవేరని వెంకటగిరివాసుల కలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. వెంకటగిరి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా చెస్తానని మాట ఇచ్చిన మూడు వారాల్లోనే జీఓ విడుదల చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీ రాజారెడ్డి, వేణురెడ్డి, కే చంద్రారెడ్డి, జీ చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి , ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, సర్పంచ్ పెంచలయ్య విజయరాఘవరెడ్డి పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలనలో వాగ్వాదం



డక్కిలి: నామినేషన్లలో తప్పిదాలను ఎన్నికల అధికారులకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

డక్కిలి: పంచాయతీ నామినేషన్ల పరిశీలనలో అభ్యర్థులు, వారి మద్దతుదారుల మధ్య వాగ్వాదం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిషత్ కార్యాలయంలో ఆల్తూరుపాడు, శ్రీపురం, దందవోలు పంచాయతీలకు సంబంధించి ఒక్కొక్క వార్డులో ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి స్టేజ్–1 ఎన్నికల అధికారిగా బీరం ప్రదీప్ వ్యవహరించారు. దందవోలు పంచాయతీ 5వ వార్డులో పోటీ చేసిన టీడీపీ మద్దతుదారుడు సీ రోశయ్య పంచాయతీ కారదర్శి పేరుతో ఫోర్జరీ సతకం చేసిన ఇంటి పన్ను రశీదును ఎన్నికల అధికారికి అందజేశారని వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి నిడిగంటి బుజ్జమ్మ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. శ్రీపురం 8వ వార్డుకు సంబంధించి టీడీపీ మద్దతుదారు మోరా లక్ష్మమ్మ ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా కేవలం జెరాక్స్ కాఫీలు మాత్రమే సమర్పించారని, ఆమె నామినేషన్ తిరస్కరించాలని వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థి పాలేపు చిట్టేమ్మ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల అధికారి ఫోర్జరీ పత్రాలు, జెరాక్స్ కాఫీలను ఎలా అనుమతిస్తారని వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల అధికారులను నిలదీశారు. ఈ విషయంపై గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఆ సమయంలో టీడీపీ నేతలు దందవోలు, శ్రీపురం వార్డుల్లో పోటీ చేసిన టీడీపీ మద్దతుదారులు ఫోర్జరీ సంతకాలతో ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదని వాదించారు. దీంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుంది. కాగా ఈ విషయంపై ఎన్నికల అధికారిని వివరణ కోరగా మండలంలో మూడు వార్డులకు సంబంధించిన 10 నామినేషన్ వచ్చాయని, అన్ని సక్రమంగా ఉండడంతో అన్ని నామినేషన్లను ఆమోదించినట్లు ఎన్నికల అధికారి ప్రదీప్ తెలిపారు.

సర్పంచ్ 4, వార్డు సభ్యులకు 21 నామినేషన్లు

గూడూరురూరల్: డివిజన్‌లో పంచాయతీ సర్పంచ్ స్థానాలకు 4, వార్డు సభ్యులకు 21 నామినేషన్లు దాఖలయ్యాయని ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ గూడూరు డివిజన్ పరిధిలో ఒక సర్పంచ్, 11 వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్లను స్వీకరించామన్నారు. సర్పంచ్ స్థానానికి 4 నామినేషన్లు రాగా, వార్డు సభ్యులకు 21 నామినేషన్లు దాఖలయ్యాయన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరురూరల్: పట్టణంలో ఈనెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీ ఓ కిరణ్ కుమార్ ఆదేశించారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య ది నోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యదిన వే డుకల్లో డివిజన్ స్థాయిలో ప్రగతి నివేదిక తెలియజేస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సభ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఆయా శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. ప్రజాప్రతినిధులందరికీ ఆహ్వానాలు పంపిస్తున్నామని వెల్లడించారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ లీలారాణి పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులు పాటించండి



విత్తనాలను పంపిణీ చేస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు.

వెంకటగిరి రూరల్: కూరగాయల సాగులో సేంద్రియ పద్ధతులు పాటించాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రైతులకు కూరగాయల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల్లో పెరటితోటలు సాగు చేయడంలో మహిళలు శ్రద్ధ చూపాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో ఈ పంటలు సాగు చేకోవచ్చని చెప్పారు. అనంతరం రైతులకు 12 రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిని చాటి చెప్పాలి



చిల్లకూరు: కమ్మవారిపాళెంలో జెండా వందనం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



డక్కిలి: ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు



పెళ్లకూరు: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



నాయుడుపేట: శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ధనలక్ష్మి

చిల్లకూరు: గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు దేశ ప్రగతిని చాటిచెప్పాలని ఎంపీడీఓ నిర్మలాదేవి అన్నారు. మండలంలోని కమ్మవారిపాళెంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ చిట్టేటి నారాయణ ఆధ్వర్యంలో నా మట్టి– నాదేశం కార్యక్రమం నిర్వహించారు. శిలాఫలకం ఆవిష్కరించి, మొక్కలు నాటారు. అనంతరం జెండా వందనం చేశాన్నారు. కడవేడు ఉప సర్పంచ్ మధురెడ్డి, ఏపీఓ గిరిబాబు పాల్గొన్నారు.

త్యాగమూర్తుల స్మరణ అందరి బాధ్యత

డక్కిలి: దేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన త్యాగమూర్తులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ఎంపీపీ జీ రాజశేఖర్ అన్నారు. మండలంలోని పలుగోడు, వడ్ల మోపూరు, దగ్గవోలు, కేబీపల్లె(తూర్పుపల్లి), పాతనాలపాడు (కమ్మవారిపల్లె), దగ్గవోలు, మార్లగుంట, సంగనపల్లెలో నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. శిలాఫలాకాల ను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసీ తిరుపతిరావు పాల్గొన్నారు.

అందరూ భాగస్వాములు

పెళ్లకూరు: నా భూమి–నాదేశం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై బాధ్యతగా మొక్కలు నాటి ఆమర వీరులకు నివాళులు అర్పించాలని ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నెలబల్లి, కొత్తూరు, పెళ్లకూరు గ్రామాల్లో నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించి, మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్‌లు కమలమ్మ, కృష్ణయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏఓ ప్రవీణ, ఏపీఓ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పూడేరులో ర్యాలీ

నాయుడుపేట: మండలంలోని పూడూరు ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల వద్ద శుక్రవారం నా భూ మి–నా దేశం కార్యక్రమాన్ని ఎంపీపీ కురుగుండ ధనలక్ష్మి ప్రారంభించారు. తొలుత శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, 75 మొక్కలు నాటారు. పంచాయతీలో మట్టిని కలశంలో మండలపరిషత్ కార్యాలయానికి తరలించారు. ఎంపీడీఓ శివప్రసాద్, సర్పంచ్ శాంతమ్మ, కార్యదర్శి సాయి, ఏపీఓ షీలుబాను పాల్గొన్నారు.

చిరువ్యాపారుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడండి



మాట్లాడుతున్న మెప్మా ఐటీ పర్సన్ శంకర్‌ప్రసాద్

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలో చిరువ్యాపారులను గుర్తించి, వారికి ప్రభుత్వం ద్వారా రుణాలను మంజూరు చేయించి, ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని మెప్మా ఐటీ పర్సన్ శంకర్‌ప్రసాద్ సూచించారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మెప్మా ఆర్పీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ పీఎం స్వనిధి, జగనన్నతోడు పథకాలకు సంబంధించి అర్హులను గుర్తించి, వారికి బ్యాంకుల ద్వారా రుణాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మెప్మా సీఓ ప్రభాకర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో జగనన్నతోడు పథకం ద్వారా 600 మందికి, పీఎం స్వనిధి రుణాలు 920 మందికి అందించామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేటటౌన్: డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ ప్రసన్నకుమార్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నాయుడుపేట, గొట్టిప్రోలు, కల్లిపేడు విద్యుత్ సబ్‌స్టేషన్లు, పెళ్లకూరు మండలంలోని చెంబెడు, శిరసనంబేడు సబ్‌స్టేషన్లు, ఓజిలి, అర్మేనిపాడు సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.